నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, బుధవారం 19 జూన్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




పెబ్బేరు వద్ద పారుతున్న జూరాల ఎడమ కాల్వ

# రామన్‌పాడు టు గోపల్‌దిన్నె రిజర్వాయర్

- తాగునీటి కోసం జూరాల నీటి విడుదల

పెబ్బేరు, జూన్ 18 : అనుకున్న సమయానికి వర్షాలు కురవకపోవడంతో తాగునీటి సమస్యను అధిగమించేందుకు నీటి పారుదలశాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరిస్తున్నారు. జూన్ మాసం ఆరంభమై ఇరవై రోజులు కావొస్తున్నా.. నైరుతి రుతుపవనాల జాడ కనిపించకపోవడంతో రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో మొదట తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలకు పూనుకున్నారు. జిల్లాలోని రామన్‌పాడు జలాశయం నుంచి జూరాల ఎడమకాల్వ ద్వారా గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు నీళ్లొదులుతున్నారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్లో నీళ్లు అడుగంటి పోయి మిషన్ భగీరథ పథకానికి ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రామన్‌పాడు నుంచి విడుదలైన నీరు పెబ్బేరు మండలం గుండా గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు తరలివెళ్తున్నాయి. ఈ విషయమై జూరాల ఈఈ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం తాగునీటి కోసమే నీటిని వదులుతున్నామని.. రైతులు సాగు కోసం ఈ నీటిని ఉపయోగించుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటి కోసం ఇంకా నీటిని విడుదల చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

# 14 మందికి షోకాజ్ నోటీసులు

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఫార్మాసిస్ట్ సస్పెన్షన్
- గద్వాల జిల్లా దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్ సంతోష్



జిల్లా దవాఖానను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, జూన్ 18 : జిల్లా దవాఖానలో పనిచేస్తున్న 14మంది వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా వారితోపాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఫార్మసిస్ట్‌పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేసిన ఘటన జిల్లా దవాఖానలో చోటు చేసుకున్నది. మంగళవారం జిల్లా ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ సంతోష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని ప్రతి వార్డును పరిశీలించి అక్కడి పరిస్థితులు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. దవాఖానలో ఎంత మంది డాక్టర్లు నిర్ధేశిత సమయానికి వచ్చారు అనే అంశంపై రిజిస్టర్‌ను పరిశీలించగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు 14మందితోపాటు మరో నలుగురు వైద్య సిబ్బంది గైర్హాజరు కావడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వైద్య సిబ్బంది హాజరు వివరాలను తెలిపే బయోమెట్రిక్‌లో వారి వివరాలను ప్రింట్ తీసి ఇవ్వాలని, అదే విధంగా విధులను సరిగా నిర్వహించని 14మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఫార్మసిస్టు స్టోర్ తనిఖీ చేసి స్టాక్ వివరాలు, రిజిస్టర్‌లు సరిగా నిర్వహించక పోవడంతో ఫార్మసిస్టును వెంటనే సస్పెండ్ చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. అనంతరం కంటి వైద్య చికిత్సకు సంబంధించిన ల్యాబ్‌ను పరిశీలించి కంటి సమస్యలతో వచ్చే రోగులకు వెంటనే మెరుగైన చికిత్సలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులకు చెప్పారు. ఆపరేషన్ థియేటర్‌ను జూలై 1నుంచి పని చేసేలా చర్యలు చేపట్టాలని, 50 పడకల వార్డులో పేషెంట్లను షిఫ్ట్ చేసి దానిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అంతకుముందు దవాఖానకు వచ్చే ఇన్, అవుట్ పేషెంట్ నమోదు వివరాలు తెలిపే రికార్డులను కూడా పరిశీలించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నవీన్ క్రాంతి తదితరులు ఉన్నారు.

# పాఠశాల వేళల్లో బస్సు నడిపించాలి

- పచ్చర్లలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులు



పచ్చర్లలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రాజోళి, జూన్ 18 : పాఠశాల వేళల్లో బస్సు నడిపించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన విద్యార్థులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పచ్చర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చదువు పూర్తి చేసుకొని హైస్కూల్ చదువులకు వెళ్లాలంటే మాన్‌దొడ్డికి వెళ్లాలి. పచ్చర్ల నుంచి మాన్‌దొడ్డికి దాదాపుగా 8 కిలో మీటర్ల దూరం ఉంటుంది. అయితే పాఠశాల సమయానికి బస్సు కోసం ప్రతి రోజూ పడిగాపులు కాస్తున్నామని, బస్సు రోజు లేటుగా రావడం వల్ల మొదటి పిరియడ్‌ను పూర్తిగా వదులు కోవాల్సివస్తుందని వాపోతున్నారు. పాఠశాల సమయానికి బస్సును నడిపించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నిరసనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసి సీఎంకు చేరేలా చూడాలని విద్యార్థులు ప్రజలకు విన్నవించారు. విద్యార్థుల నిరసన కార్యక్రమానికి గ్రామస్తులు కూడా మద్దతు తెలిపారు.

# చివరి ఆయకట్టుకూ సాగునీరందిస్తాం

- పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్, జూన్ 18 : కోయిల్‌సాగర్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరందిస్తామని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తీలేరు పంప్‌హౌస్ నుంచి కోయిల్‌సాగర్‌కు ఆమె నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ రైతులకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తామని, రైతులు ఆధైర్యపడవద్దన్నారు. తీలేరు స్టేజీ-2 పంప్‌హౌస్ నుంచి నిత్యం 350 క్యుసెక్కుల నీటిని కోయిల్‌సాగర్‌కు తరలిస్తామని, కోయిల్‌సాగర్‌కు నీరు చేరగానే పంటల సాగుకు నీటిని కుడి, ఎడమ కాల్వల ద్వారా విడుదల చేస్తామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే కోయిల్‌సాగర్ లిఫ్ట్ మోటర్లను ప్రారంభించి కాల్వ వద్ద కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మరికల్‌లో ప్రైవేట్ స్కూల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తీలేరు మాజీ సర్పంచ్ రేవతమ్మ, ఎంపీటీసీ సునీత, మరికల్ ఎంపీటీసీ గోపాల్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు సూర్యమోహన్, కృష్ణయ్య, మండలాధ్యక్షుడు వీరన్న, హరీశ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ధన్వాడ పీఏసీసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, తదితరులున్నారు.



కృష్ణమ్మకు పూలు చల్లుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

# చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

గోపాల్‌పేట, జూన్ 18 : చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఏదుట్లలో చోటు చేసుకున్నది. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. ఏదుల మండలకేంద్రానికి చెందిన బోయిని కుర్మయ్య (41) వ్యవసాయ కూలీ. హైదరాబాద్‌లోని లింగంపల్లిలో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఏదుట్ల గ్రామంలో ఎల్లమ్మ పండుగకు రెండో కూతురు ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం అల్లుడి తమ్ముడైన శరత్‌తో కలిసి గ్రామ శివారులోని బావిలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకొని నీట మునిగి మృతి చెందాడు. విషయం తెలుసకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీయించారు. మృతుడి భార్య బోయిని కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నాడు.

## నీళ్లు తాగేందుకు వెళ్లి బావిలో పడి మహిళ మృతి

నవాబ్‌పేట, జూన్18: దాహం తీర్చుకునేందుకు వెళ్లిన ఓ వివాహిత, మూర్చవ్యాధితో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం నవాబ్‌పేట మండలం కేశవరావుపల్లిలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని కేశవరావుపల్లికి చెందిన వివాహిత జెట్టి లావణ్య (35) వారి సొంత వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా, దాహం తీర్చుకునేందుకు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దిగింది. లావణ్యకు మొదటి నుంచే మూర్చవ్యాధి ఉండటంతో నీటిలో దిగిన వెంటనే మూర్చ వచ్చి పడిపోయి, అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త వెంటకయ్య, కుమారుడు ఉన్నారు.

## పులులకు హాని తలపెడితే రూ.10లక్షల జరిమానా

మద్దూర్ (కొత్తపల్లి)జూన్ 18 : పులులకు హాని తలపెడితే రూ.10లక్షల జరిమానాతోపాటు ఏడేండ్ల జైలు శిక్ష విధిస్తారని అటవీశాఖ పాలన అధికారి లక్ష్మణ్ మంగళవారం ప్రకటనలో హెచ్చరించారు. మద్దూర్, కొత్తపల్లి మండలాల పరిధిలోని చెన్నారెడ్డిపల్లి, కంసాన్‌పల్లి, దుప్పటిగట్టు, నందిగామ, తిమ్మారెడ్డిపల్లి, నందిపహాడ్, మోమినాపూర్ గ్రామాల్లో కొన్ని రోజులుగా పులులు సంచరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడంతోపాటు వాటికి ఎలాంటి హాని తలపెట్టకూడదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పంట పొలాలకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినా, విష ప్రయోగం చేసి వాటిని చంపేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పులులను బంధించడానికి హన్మానాయక్‌తండా, చెన్నారెడ్డిపల్లి మైసమ్మ గుడి ఏరియాలో, నందిపహాడ్‌లో బోన్లు ఏర్పాటు చేశామని, ప్రజలు అటు వైపు వెళ్లొద్దని సూచించారు.

# జూరాలకు తగ్గిన వరద

- 3,807 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 2,881 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదు

గద్వాల, జూన్ 18 : జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం ప్రాజెక్టుకు 3,807 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అవుట్‌ఫ్లో 2,881 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.949 టీఎంసీలకు చేరుకున్నది. నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 810 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650 క్యూసెక్కులు, లిఫ్ట్-2కు 844 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 966 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**ఆర్డీఎస్‌కు స్వల్ప వరద**

అయిజ, జూన్ 18 : ఆర్డీఎస్ ఆనకట్టకు మంగళవారం 2,357 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 2,357 క్యూసెక్కులు సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నదని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 8.4అడుగుల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

**తుంగభద్ర డ్యాంకు..**

టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 770 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,752 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాంలో ప్రస్తుతం 5.979 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారి రాఘవేంద్ర తెలిపారు.



పూర్తిగా దెబ్బ తిని గండ్లు పడిన జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ



## కాల్వలు ఇలా.. నీళ్లు పారేదెలా..?

- దెబ్బ తిన్న జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ
- అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం

జోగుళాంబ గద్వాల-వనపర్తి జిల్లాల సరిహద్దులో నిర్మించిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ దెబ్బతిన్నది. డ్యాం నుంచి నీటి విడుదల సమయంలో కాల్వకు గండ్లు పడినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే జూరాల ఆడియోస్ లింక్ కాల్వకు నీరందక ప్రతి ఏడాది పంటలు నష్టపోతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారుల అలసత్వానికి నిలువుటద్దం ఈ గండ్లు అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటు పడిందని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలుగా కర్షకులకు కష్టాలు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

**- ఫొటోగ్రాఫర్, జోగుళాంబ గద్వాల, జూన్ 18**

*టమాట ధర మాట రానీయడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో సామాన్యుడు ఈ పేరెత్తితే బెదిరిపోయే పరిస్థితులు దాపురించాయి. వారం కిందటి వరకు రూ.50 వరకు ఉన్న టమాట కిలో ధర ఏకంగా రెట్టింపై రూ.100కు చేరింది. సామాన్యులు బెంబేలెత్తిపోతుండగా.. పేదలు కొనలేని దుస్థితి. దీనికితోడు అన్ని కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏం కొనలేని.. ఏం తినలేని పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇటు ప్రజలతోపాటుగా అటు వ్యాపారులు, ఏజెన్సీల నిర్వాహకులకూ వంటల్లో మోయలేని భారంగా మారింది.*

*– నాగర్‌కర్నూల్, జూన్ 18 (నమస్తే తెలంగాణ)*



**కిలో వంద అంటే ఎలా కొనాలి**

కూరగాయలు కొనేందుకు రైతుబజార్‌కు వచ్చాం. టమాటనే రూ.100కిలో అంటున్నారు. ఒక్క టమాటలే కొంటే మిగిలిన కూరగాయలను ఎలా కొనాలి. ఒక్క పావు కిలో టమాటలే కొన్నాను. రైతుబజార్‌లో కొందరే టమాటలు అమ్ముతున్నారు. కొన్ని రోజులైతే ఈ టమాటలు కూడా దొరకవని అంటున్నారు.

**- తిరుపతి, వ్యాపారి, నాగర్‌కర్నూల్**




**ధర చూసి టమాట కొనలే ..**

ఇంట్లో వంటల కోసం వస్తే టమాట కిలో రూ. 100అంటున్నారు. పాడైన టమాటలు రూ.70-రూ.80అంటున్నారు. ఈ టమాటలు కూడా బాగా పండిపోయాయి. టమాటలు లేకుండా వంటలు చేసుకోలేము. ఎక్కువ రోజులు కూడా ఇంట్లో ఉంచుకోలేం. టమాటల ధర, పండిపోయిన వాటిని చూసి కొనుక్కోలేదు.

**- సుధాకర్, నాగర్‌కర్నూల్**

సెంచరీ కొట్టిన ధర

# టమోత







నాగర్‌కర్నూల్ రైతు బజారులో ధరలు పెరగడంతో కొనుగోలుదారుల లేక ఖాళీగా ఉన్న వ్యాపారులు

- వంటింట్లో టమాట మంటలు
- కురవని వానలు, తగ్గిన సాగు
- రోజురోజుకూ పెరుగుతున్న ధర
- అల్లాడుతోన్న సామాన్యులు
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో వంటలపై తీవ్ర ప్రభావం

టమాట ధర రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. ప్రతి వంటకంలోనూ తప్పనిసరిగా ఉపయోగించే టమాట ఇప్పుడు వంటింట్లోకే రానంటోంది. గత వారం కిందట రూ.30నుంచి రూ.50వరకు పలికిన కిలో టమాట ధర ఇప్పుడు ఏకంగా రెట్టింపయ్యింది. నాగర్‌కర్నూల్ రైతుబజార్‌లో రూ.100కు కిలో టమాట ధర పలకడం గమనార్హం. గత కొద్ది రోజులుగా కూరగాయల ధరలు పెరుగుతూనే వస్తున్నాయి. దీనివల్ల సామాన్యులకు ముఖ్యంగా శాఖాహార ప్రియులకూ పెరిగిన ఈ ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. పాలకూర, తోటకూర, గోంగూరలాంటి ఆకుకూరలు గతంలో రూ.10కి 5 కట్టల చొప్పున ఇవ్వగా ఇప్పుడు రూ.20కి 3లేదా 4, 5చొప్పున అమ్ముతున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఓ స్థాయికి చేరగా మిర్చి ధర రూ.100దాటి అటు, ఇటుగా మారుతోంది. ఉల్లి కూడా ఘాటెక్కింది. ఏ వంటకంలోనైనా ఖచ్చితంగా ఉపయోగించే టమాట ఏకంగా రూ.100కు చేరడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఈసారి వానకాలంలో సరైన వర్షాలు కురియకపోవడంతో కూరగాయల ధరలు పెరుగుతూనే వస్తున్నాయి. ఈ వానకాలంలోనైనా సకాలంలో వర్షాలు కురిస్తే ఈ ధరలు కాస్త తగ్గుతాయని ఆశించిన ప్రజలకు వరుణుడు దయ చూపడం లేదు. కాగా గత పదిహేను రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు అప్పటికే తోటల్లో ఉన్న టమాట పంట దెబ్బతిన్నది. ప్రస్తుతం చాలా వరకు గ్రామాల్లో కూరగాయలు ముఖ్యంగా టమాట రైతు బజార్లకు, మార్కెట్లకు రావడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లోని రైతు బజార్లకు రైతులు, వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం చేరిన ధరతో రైతు రూ.100నోటు ఇస్తేనే టమాట ఇంటికి వస్తాననే పరిస్థితులు రావడం విశేషం. పెరిగిన ధరలతో సామాన్యు ల పరిస్థితి ఇలా ఉంటే మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు చేసిపెట్టే భోజనాలపై కూడా ఈ ప్రభావం చూపుతున్నది. టమాటలు లేకుండా వంటకాల చేసే పరిస్థితులు రావడంతో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందే పరిస్థితులు దూరమయ్యాయి. నాగర్‌కర్నూల్ ప్రాంతానికి రైతులు మదనపల్లి మార్కెట్ నుంచి టమాటలు తీసుకొస్తున్నారు. అక్కడ కూడా రూ.60, రూ. 80చొప్పున కొనుగోలు తీసుకొస్తుండటంతో రవాణా, ఇతర ఛార్జీలను కలుపుకొని వ్యాపారులు రూ.100కు కిలో చొప్పున టమాటలు విక్రయిస్తున్నారు. స్థానికంగా టమాటలు దొరక్కపోవడంతో టమాట ధరలు పెరిగాయి. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ రైతుబజార్‌లో సాధారణ రైతులెవరూ టమాటలు అమ్మడం లేదు. పది మంది వరకు రైతులే టమాటలను విక్రయిస్తున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే రాబోయే వారం, పది రోజుల్లో టమాట ధరలు రూ.200వరకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కాగా వర్షాకాలం వస్తే కూరగాయల ధరలు తగ్గుతాయని భావిస్తున్న సామాన్యులకు పెరిగిన ఈ టమాట మంటలు వంటింట్లో మంటలను పుట్టిస్తోంది.

# నిత్యావసర ధరలకు రెక్కలు

మహబూబ్‌నగర్, జూన్ 18 : నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అసలే జూన్ నెల వచ్చిందంటే అన్ని వర్గాల ప్రజలు భయపడుతున్నారు. ఒక వైపు రైతులు పంటల పెట్టుబడి ఖర్చులు, మరో పక్క పిల్లల చదువుల కోసం ఫీజులు, బుక్కులు, పుస్తకాలు వగైరా ఇలా తడిసి మోపెడవుతున్న క్రమంలో నిత్యావసర ధరలు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పప్పు, చింతపండు, నూనె తదితర ధరలు ఆకాశనంటుతుండగా అందులో టమాట కూడా వచ్చి చేరింది. టమాట ధర రూ.100కు చేరడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇక కూరగాయల ధరలు కూడా రూ.80 నుంచి వంద పలుకుతున్నాయి. పచ్చి మిర్చి రూ.100 నుంచి 120 పలుకుతున్నది. ఆకు కూరలు పది రూపాయలకు నాలుగైదు కట్టలకు మించి రావడం లేదు. కొత్తిమీర, పుదీనా, కరివేపాకు సైతం పది రూపాయలకు చిన్నకట్ట మాత్రమే ఇస్తుండడంతో ప్రజలు ఏం కొనాలి, ఏం తినాలని ఆందోళనకు గురవుతున్నారు.





రాహుల్ (ఫైల్)

# బ్రెయిన్ డెడ్‌తో యువకుడి మృతి

- అవయవ దానానికి ముందుకొచ్చిన కుటుంబసభ్యులు

నారాయణపేట, జూన్18 : అడవిపంది ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడి, మృత్యువుతో పోరాడుతున్న యువకుడు బ్రెయిన్ డెడ్ అయి సోమవారం చనిపోయాడు. ఆ వివరాలు.. నారాయణపేట మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన నారాయణరావు కుమారుడు రాహుల్(40) జడ్చర్లలోని అరబిందో కంపెనీలో ఉద్యోగి. ఇటీవలే గ్రామానికి వచ్చాడు. 11వ తేదీ మంగళవారం ఉద్యోగానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో కోటకొండ శివారులోని వింజమూరు గండి వద్ద అడవిపంది బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబసభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కేర్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతుండగా సోమవారం బ్రెయిన్‌డెడ్ అయి మృతి చెందాడు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అతనికి 57 రోజుల కిందట (ఈఏడాది ఏప్రిల్ 21 న) హైదరాబాద్‌కు చెందిన అమ్మాయితో వివాహమైంది. అతని మృతితో ఇరుకుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

***దుఃఖంలోనూ అవయవ దానం..***

కుటుంబ సభ్యులు అంతటి దుఃఖంలోనూ రాహుల్ అవయవాలను దానంచేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు దవాఖాన నిర్వాహకులు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలియడంతో నాయకులు నాగురావు నామాజీ, చందులాల్ తదితరులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.